# ఎందుకు

కప్పగంతుల మల్లికార్జునరావు




'అప్పుడే వచ్చేశావేం స్కూలునుంచి?'

పుస్తకాలు బల్లమీద పెట్టి, అంతలోనే వెనక్కి తిరిగి వరుగుమీద వెళ్ళబోతున్న పద్నాలుగేళ్ళ సూర్యం, ఒక్కక్షణం ఆగినట్లు ఆగి వెనక్కి తిరిగి తండ్రివైపు చూశాడు.

'[illegible] నాన్నా!' అని చెప్పుతూనే ముందుకు నడిచాడు.

'ఎందుకు?'

తండ్రి ప్రశ్న గాలిలోనే వుంది. సూర్యం గాలికన్నా వేగంగా పరుగెత్తి వాకిట్లోకి వెళ్ళిపోయాడు.

* * *

నగరం నిద్రపోతోంది. నిద్రపోయే నగరాన్ని, వళ్ళంతా కళ్ళు చేసుకొని కాపలా కాస్తున్నాయి బజార్లోని విద్యుద్దీపాలు.

హాస్పిటల్ అంతా చీకటిగా వుంది. ఒకరు యిద్దరు తప్ప రోగులంతా మేల్కొనే వున్నారు—కళ్ళు మూసుకొని. బాధ భరించలేని జీవులు 'అమ్మా' అంటూ మెల్లగా మూలుగుతున్నారు. ఆ మూలుగులకు అలవాటుపడ్డ నర్సు కుర్చీలో కూర్చొని కునికిపాట్లు పడుతోంది.

మాధవయ్య పడుకొన్నాడన్న మాటే కాని కన్నుమాత్రం మూయలేదు. అవతల పక్కమీది రోగుల మూలుగులు అతనికి వినిపిస్తూనే వున్నాయి. ఎవరో నిద్రపట్టిన అదృష్టశాలి గురక కూడా లయబద్ధంగా వినిపిస్తోంది. మాధవయ్య మనసు మాత్రం ఎక్కడో వుంది. ఎక్కడో...ఎక్కడో...

హాస్పిటల్ కాంపౌండులోని రెండు కుక్కలు, రోగులు సహించక అవతల పారేసిన రొట్టెముక్క కోసం భయంకరంగా అరుస్తూ కాట్లాడుకొంటున్నాయి. దూరంగా రైలుమోత—రోడ్డుమీద లారీల రొద.

మాధవయ్య పక్కమీది నుంచి లేచాడు. మంచంపైని అసహనంగా కళ్ళు మూసుకొని పడుకొని వున్న కొడుకువైపు చూశాడు. ఎదురుగా వున్న కిటికీలోనుంచి ఆకాశం కన్పించింది. ఆకాశాన్ని నల్లని మబ్బులు ఆక్రమించి వున్నాయి. వాటి వెనుక కన్పించీ కన్పించనట్లు మిణుకు మిణుకు మంటూ వుంది ఓ నక్షత్రం.

నర్సు దగ్గరకు నడిచాడు మాధవయ్య. అతని అడుగుల చప్పుడుకే కళ్ళు తెర్చిన నర్సు 'ఏమయింది?' అని ఆత్రంగా ప్రశ్నించింది.

'టైం ఎంతయింది?'

నర్సు నిరాశగా నిట్టూర్చింది. ఆ తర్వాత చిరాగ్గా అతన్ని చూసింది.

'మీరిలా మాటిమాటికి టైం చూస్తే, లాభం లేదండి... ఓపిక పట్టాలి...వెళ్ళి పడుకోండి...రెండుంబావు దాటింది.'

కళ్ళు మూసుకొని వెనక్కు వాలిందామె.

'రెండుంబావు...రెండుంపావేనా ఇంకా?' అని గొణుక్కుంటూ, మాధవయ్య కొడుకు మంచం దగ్గరికి నడిచాడు మళ్ళీ.

ఆవేళ పొద్దున్న పదకొండుగంటలకు అందంగా, కాంతివంతంగా, వుత్సాహంగా వున్న కొడుకు మొహం, పాలిపోయి అందవిహీనంగా, వాడిపోయి కన్పిస్తున్నదిప్పుడు. ముక్కుకు పెట్టిన ఆక్సిజన్‌గొట్టంలోనుంచి నీటి బుడగలు వస్తున్నాయి నోటికొనలనుంచి వస్తున్న నురుగు

మెల్లగా బుగ్గలమీదికి జారుతోంది.

మాధవయ్యకాదృశ్యం భయంకరంగా కన్పించింది. భరించలేకపోయాడు. వెళ్ళి, మూతి, ముక్కులను ఉత్తరీయంలో సున్నితంగా, మృదువుగా తుడిచాడు. బుగ్గను మృదువుగా తాకేడు. అటూ యిటూ చూచి మెల్లగా ముద్దు పెట్టుకొన్నాడు.

కన్నీళ్ళు, వెక్కిళ్ళు కల్సి వచ్చాయి. బాధ భరించలేకపోయాడు. కిటికీదగ్గరున్న కుర్చీలో కూలబడి, కిటికీగోడకు తల ఆనించి కుమిలికుమిలి ఏడవసాగేడు.

* * *

మాధవయ్య మామూలు మనిషి. చెప్పుకోటానికి గత చరిత్ర అంటూ ఏమీలేనివాడు. అందుకే అతనికి రేపటినిగురించిన ఆలోచన తప్ప నిన్నటిని గురించిన ఆలోచన ఎప్పుడూ లేకపోయింది.

చిన్నప్పటినుంచి బాధలను బాగా రుచి చూచాడు. ఇప్పుడు వాటికి అలవాటు పడ్డాడు.

వృత్తి చేత గుమాస్తా. ఊరంటూ చెప్పుకోటానికొకటివున్నా అది వొదిలి ఎన్నాళ్ళయిందో? ఉద్యోగ ధర్మంలో పైవాళ్ళు ఎక్కడికి వెళ్ళమంటే అక్కడికెళ్ళేడు. ఏవూరుమీదా మమకారాన్ని పెంచుకోలేదు. అందుకే బదిలీవస్తే తప్పించుకొనే ప్రయత్నం ఏనాడూ చేసి ఎరుగడు.

చివరికిప్పుడీ పట్నానికి పొమ్మన్నారు. వచ్చి రెండవత్సరాలు దాటింది.

రోజూ పేపరు చదివే అలవాటున్నా, ఎన్నడూ రాజకీయాలనుగురించి చర్చించి ఎరుగడు. సాంస్కృతిక విషయాలపట్ల అభిలాషవున్నా, అవకాశాల్లేనని తెల్సుకొని, వాటి జోలికే పోయేవాడు కాడు

ఇలాంటి మాధవయ్యకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు ఆడ, వొక మగ. మగపిల్లవాడు పెద్దవాడు.

ఆర్థిక, ఆరోగ్యపరిస్థితుల దృష్ట్యానైతేనేమి, ప్రచారప్రభావానికి లోబడి అయితేనేమి, భార్యకు మూడో కాన్పు అయ్యాక, మాధవయ్య 'వేసక్టమీ' ఆపరేషన్ చేయించుకొన్నాడు.

సరిగ్గా ఆపరేషన్ చేయించుకొన్న అయిదోనాడు, ఆఖరుపిల్ల కారణం లేకుండా కళ్ళు మూసింది.

కూతురుపోయాక వున్న యిద్దరిపైన మమకారం మరింత జాస్తియింది. అవును మరి! కావాలన్నా యిక పిల్లలు పుట్టరు. ఉన్న ఆ యిద్దరికీ ఏమన్నా అయితే? అందుకే, తాము తిన్నా తినకపోయినా ఆ పిల్లలకేం లోటు లేకుండా చూచేవారు, మాధవయ్య, ఆయన భార్య.

పెద్దవాడు సూర్యానికి పద్నాలుగేళ్ళు. హైస్కూల్లో చదువుతున్నాడు. చదువులో చురుకైనవాడు మిగతా విషయాలు ఆట్టే పట్టించుకొనే స్వభావం లేనివాడు.

తన ప్రశ్నకు సమాధానంకూడా యిచ్చే వ్యవధిలేనంత వుత్సాహంగా ఎక్కడికి వెళ్ళివుంటాడు సూర్యం?...ఆలోచించ సాగేడు మాధవయ్య

ఊళ్ళో నాలుగైదు రోజులుగా కాలేజీ విద్యార్థులు సమ్మె చేస్తున్నారని మాధవయ్యకు తెల్సు. కాగా సంవత్సరానికొక్కసారైనా సమ్మె చేయటం యీ కాలేజీ విద్యార్థుల విద్యార్జనలో భాగం అయిపోయిందా—అని కూడా అప్పుడప్పుడూ అనుకొనేవాడతను!

విద్యార్థులు తమకు సంబంధించిన సమస్యలను తీర్చుకోటానికి సమ్మెచేస్తే మాధవయ్య హర్షించగలడు. కానీ తమకు లక్కర్లేని వ్యవహారాలక్కూడా విద్యార్థులు సమ్మెను, ఆందోళనను, ఆయుధంగా వుపయోగించటం చూచి మాధవయ్య మనసులోనే విచారించేవాడు.

కాగా ఆందోళనంటే బస్సులు, రైళ్ళు, తగలబెట్టటమా? ప్రజాజీవితాన్ని స్తంభింప చేయటమా? రాళ్ళు రువ్వి బజార్లోని షాపులను నాశనం చేయటమా? కాదు. కాని దురదృష్టవశాత్తు అదే పద్ధతిన నడుస్తున్నాయి విద్యార్థుల ఆందోళనలు. కాగా యిలాటి పనులు చేస్తేనేకాని పైవాళ్ళు, కోర్కెలను తీర్చకపోవటం యీ పద్ధతులకు మరింత బలాన్నిస్తోంది... అందుకు మాధవయ్య మనసులోనే విచారించేవాడు! అతనంతకన్నా ఏం చేయలేని మనిషి మరి!

ఊళ్ళో యిప్పుడు జరుగుతున్న సమ్మె, ఆందోళనకూడా యిలాంటిదే. సమస్య, విద్యార్థులకుమాత్రమే సంబంధించేనది కాదు. ముఖ్యంగా పెద్దలకి, ప్రజలందరికీ సంబంధించినది.

ఎవరో విద్యార్థి, ఎక్కడో నిరాహార దీక్ష ప్రారంభించాడు. దాంతో ఆందోళనకు బలం వచ్చింది. బలం పుంజుకొనేసరికి రెండువర్గాల వారయ్యారు విద్యార్థి నాయకులు.

వాకిట్లో ఏవో నినాదాలు విన్పించి మాధవయ్య ఆలోచనకు అంతరాయం కలిగింది.

కొందరు విద్యార్థులు నినాదాలు చేసుకొంటూ వెళ్తున్నారు. వారి వెనుక సాయుధ పోలీసులు.

మాధవయ్య గుండెల్లో ఏదో భయం వొక్కక్షణం మెదిలింది. తాను పిలుస్తున్నా వినిపించుకోకుండా సూర్యం వెళ్ళింది ఆందోళనలో పాల్గొనటానిక్కాదు కదా ?

అనుకోకుండానే ఆయనకాళ్ళు కొడుకోసం గుంపునంతా వెతికాయి. క్రమంగా నినాదాలు దూరమయ్యాయి. వెతికి వెతికి అలసిపోయిన కళ్ళు ఆకాశంలోకి చూచాయి నిరాశగా. కాళ్ళు భారంగా లోపలికి నడిచాయి.

కొడుకు యిలాంటి వాటి జోలికి వెళ్ళడని మాధవయ్యకు తెల్సు. వెళ్ళవద్దని తను ఎన్నోసార్లు చెప్పేడు

అయినా ఏమో?

తాను ఎంతమంది పిల్లల్ని చూడలేదు — అర్థంపర్థంలేని కేక లేసుకొంటూ పోతుండగా. ఆందోళన పేరిట బస్సుల్లో ఎక్కి అల్లరిచిల్లరి పనులు చేసిన పిల్లల్నెంతమందిని తను చూడలేదు?

లేకపోతే యిన్నిరోజులుగా కాలేజీ విద్యార్థులకే పరిమితమైన సమ్మె హైస్కూలుకెలా పాకింది?

బజార్లో వెళ్తున్న బస్సులోనుంచి నినాదాలు వొక్కసారి, అలలాగా పొంగి వచ్చినట్లు బిగ్గరగా విన్పించి, అంతలోనే బస్సుతోపాటే దూరమయ్యాయి.

'ఏమిటీ నినాదాలు ? ఎందుకుదే? ఎందుకీ గలాటా ?' మళ్ళీ మళ్ళీ ఆ ప్రశ్న మనసులో.

నినాదాలు ప్రాంతీయ ద్వేషాలను రెచ్చకొట్టేవి. చేతలూ అంతే.

ఒకే తల్లి, బిడ్డలమధ్య వైరం. అన్నదమ్ముల గుండెల్లో హాలాహలం ఎందుకు? ఎందుకు ?...అన్ని ప్రశ్నలే. సమాధానాలు దొరకని ప్రశ్నలు.

'సూర్యం యింకా రాలేదండి. ఎక్కడి

## తెల్ల మచ్చలు

శరీరంలో తెల్లమచ్చలను పోగొట్టుటలో ఇతర మందులకు సమానమేదని మీరు నిస్పృహ చెందేటట్లయితే వెంటనే కాకు శాంపిల్ సక్తై వ్రాయండి లాభం పొందినతర్వాతనే డబ్బు పంపండి నమ్మకంలేనివారికి ఫార్మలా కూడ మే పంపెదము ఉచితంగా ఇస్తాము ఆకర్షణీయమైన ప్రకటనలు చూచి మోసపోవద్దు

Western India Co (V N)
P O Katri Sarai (Gaya)



### నెలకు రు. 5/-వంతున చెల్లించి పొందండి

పార్కర్ 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్‌సిస్టర్ పొందండి ప్రతి గ్రామమునకు, పట్టణమునకు పంపగలము



JAPAN TRANSISTORS(AT)
Kolhapur Road, Delhi 7






## లిచెన్‌సా

వాడండి

DZ1613ATG


# ఎందుకు?

కెళ్ళేడో ఏమో ? ఊళ్లో గొడవలుగా వున్నాయట వొక్కసారి అలా వెళ్ళి చూచి రండి—' భార్య అభ్యర్థన యిది ఎన్నోమారో ?

కాని ఎక్కడికని వెళ్ళి చూడగలడు తాను ? నగరం మహానగరం. ఆ నగరంలో ఎక్కడికెళ్ళేడో ?

అయినా మాధవయ్యకు కాలు యింట్లో నిలవటం లేదు ఆతృత ఆశపెట్టింది లేచి వాకిట్లోకి నడిచేడు

విజయవాడలో ఎండకాలంలా వూరు వుడికి పోతోంది ఏ బస్సులో చూచినా విద్యార్థులే ఏ వీధిన పట్టినా నినాదాలే

ఎదురుగా సూర్యం యీడువాళ్ళే కొందరు పిల్లలు. తీరా దగ్గరికెళ్ళి చూస్తే నిరాశ సూర్యం అక్కడా లేడు.

'బాబూ మీరేం చదువుతున్నారు?'

'నైన్త్'

'ఇవాళ బడికి పోలేదేం మరి?'

'సమ్మె చేస్తున్నాంగా—'

'ఎందుకు సమ్మె?'

'ఏమో మాకేం తెల్సు? కాలేజీవాళ్ళు చేయమన్నారుగా !'

వాళ్ళ అమాయకత్వానికి జాలివేసింది. ఏమీ తెలియని పిల్లలు నిర్మలత్వం తప్ప మంచితనం తప్ప, చెడును క్రూరాన్ని వూహించనైనా లేని పసికందులు ! ... అనుకరించటం పిల్లల కలవాటు పిల్లల్లోని ఆ సహజ బలహీనతను యిలా చెడుమార్గానికి వుపయోగించటం న్యాయమా ? యివాళ్టి యీ పిల్లలకి యిలాంటి ద్వేషభావాలు, దుర్మార్గ వర్తనను నేర్పితే, రేపు వీరు పౌరులవుతే దేశం ఎలాగుంటుంది ? అసలా పిల్లల జీవితాలేంకాను ?

సాయంకాలమయింది చూడాల్సిన చోట్లల్లా చూచాడు తిరిగి తిరిగి కాళ్ళు నొప్పివేసేయి.

'యీ పాటికి వాడు యింటికెళ్ళే వుంటాడు' అనుకొంటూ వెనక్కి మళ్ళేడు కాలేజీ దగ్గరికొచ్చేసరికి కాళ్ళు ఆగిపోయాయి

ఆ ప్రాంతమంతా పోలీసుల మయం అటువైపు విద్యార్థులు అల్లంతదూరంలో యిటువైపు పోలీసులు బారులుకట్టి నిల్చున్నారు

'ముందుకెళ్ళకండి వెనక్కి వెళ్ళండి.'

'ఏమయింది బాబూ ?'

పోలీసతను మాధవయ్యవైపు వింతగా చూచాడు

'ఏమయిందా? మా శ్రాద్ధమయింది.' చిరాగ్గా అన్నాడా పోలీసతను — 'ఈ పోలీసు వుద్యోగం పగవాడిక్కూడా వద్దండి బాబూ రాళ్ళు రువ్వినా పిల్లల్నేమన కూడదు మంచిగా చెప్తే వినరు లాఠీ ఛార్జి చేస్తే నేరం. ఇక కాల్పులు జరిగాయా—మా ప్రాణాలకు పుటె'

మాధవయ్యకు అతను చెప్పినదాంట్లో అబద్ధమేం కనపడలేదు అల్లరిమూకను అదుపులో పెట్టలేపోయినా వారినే అంటారు, దండించి అదుపులో పెట్టినా వాళ్ళనే అంటారు

'దయచేసి యింక వెళ్ళండి సార్. యిక్కడ కాల్పులు జరిగేయి యిప్పుడిదంతా ప్రొహిబిటెడ్ ఏరియా—'

'కాల్పులు జరిగాయా !'

'ముగ్గురు కుర్రాళ్ళకి దెబ్బలు కూడా తగిలేయి హాస్పిటల్‌కి తీసికెళ్ళేరు'

మాధవయ్య హాస్పిటల్‌కి వెళ్ళేసరికి దెబ్బలు తగిలిన కుర్రాళ్ళకి చికిత్స చేస్తున్నారు

దెబ్బలు తగిలింది ముగ్గురికి అందులో వొకతనికి చాలా సీరియస్ మిగతా యిద్దరి ప్రాణానికి ప్రమాదం లేదు

ఆ ముగ్గురిలో తన కొడుకు వుండకూడదని మాధవయ్య భగవంతుణ్ణి ప్రార్థించాడు

అయినా యింతమంది విద్యార్థుల్లో తన సూర్యానికే ఆ దెబ్బ తగలాలని ఎక్కడుంది? అసలు సూర్యం అక్కడికెందుకొచ్చి వుంటాడు ?

పక్కనున్న పెద్దమనిషి ట్రాన్‌సిస్టర్‌లో ప్రాంతీయ వార్తలు వినవస్తున్నాయి—

'ఆ మధ్యాహ్నం విద్యార్థులంతా బస్సుల్ల మీద కాలేజికి చేరుకొన్నారు వాకిట్లో వున్న పోలీసులమీద రాళ్ళు రువ్వసాగేరు. అక్కడినుంచి పెద్ద వూరేగింపు సాగించాలని వాళ్ళ ప్రయత్నం దాన్ని పోలీసులు కొనసాగించక పోయేసరికి రాళ్ళను వర్షంలా కురిపించారు చాలామంది పోలీసులకు దెబ్బలు తగిలాయి. గుంపును చెదరగొట్ట

టానికి భాష్పవాయువు నుపయోగించారు. రెచ్చిపోయిన విద్యార్థులు పోలీస్‌వ్యాన్‌కు నిప్పుపెట్ట ప్రయత్నించగా, పోలీసులు కాల్పులు సాగించారు యిద్దరు స్కూలు విద్యార్థులకు, వొక కాలేజ విద్యార్థికి గాయాలు తగిలేయి. అందులో వొక విద్యార్థి పరిస్థితి ప్రమాదకరంగా వుంది.

తోపుడుబండిలో వో కుర్రాడిని వరండా లోకి తీసుకొచ్చారు గుండె చిక్కబట్టుకొని మాధవయ్య ఆ కుర్రాడివైపు చూచాడు. సూర్యం యీడువాడే. కానీ సూర్యం కాదు.

రెండోకుర్రాడు ఊహూ... అతనూ కాదు అమ్మయ్య!

మూడోవాడు. కాదను కొంటూనే చూచాడు. చూచి అదిరిపోయాడు! వాడు సూర్యం.. తన సూర్యం...

'సూర్యం '

మాధవయ్య బాధకు హాస్పిటల్ గోడలు కన్నీళ్లు కార్చెయి!

* * *

'మిస్టర్'

డ్యూటీ మారనున్నది కొత్త నర్సు తెలగని తెల్లనిబట్టలతో ఎదురుగా నిల్చొని వుంది

'ఏమిటాలోచిస్తున్నారు?'

'టైం ఎంతయింది?'

'కన్పించటం లేదూ? తెల్లగా తెల్ల వారింది.'

మాధవయ్య మామూలు స్థితికి వచ్చి కిటికీలోకుండా మళ్ళీ చూచాడు చీకట పొరలు తొలగిపోతున్నాయి. వెలుతురు విప్పారుతోంది.

'నా సూర్యానికేం ఫరవాలేదుకదూనర్స్?'

నర్సు నవ్వింది — ఫర్వాలేదన్న హామీ యిస్తున్నట్లు

'డోన్ట్ వర్రీ—వెళ్ళి మొహం కడుక్కొని కాఫీ తాగి రండి రాత్రంతా మేలుకొనే వున్నట్లున్నారు—'

నర్సు ఛార్టు చూడటంలో నిమగ్నమయింది పనిమనిషి చీపురు పట్టుకొని వూడవటానికొచ్చింది.

సూర్యంలో మార్పేమీ లేదు. అలాగే అచేతనంగా వున్నాడు.

మాధవయ్య పంపుదగ్గర మొహం కడుక్కొన్నాడు.

కాఫీకని హోటల్లోకి వెళ్తే బల్లమీద పేపరు—'కాల్పుల్లో దెబ్బలు తగిన సూర్యం పరిస్థితి ప్రమాదం—'

ఇక చదవలేకపోయాడు మాధవయ్య

డాక్టర్లు నలభై ఎనిమిది గంటలు దాటితేనే కాని ఎటూ చెప్పలేమన్నారు. ఇప్పటికింకా అందులో సగం కాలం దాట లేదు. ఎలా వుందో సూర్యానికి?'

'వెళుతున్నారేం సార్? ఏం కావాలి?'

మాధవయ్య హాస్పిటల్ కొచ్చేసరికి సూర్యం మంచం చుట్టూ చాలామంది జనం మూగివున్నారు కొందరు విద్యార్థులు—మరికొందరు పత్రికా విలేఖరులు, ఫోటోగ్రాఫర్లు..

సూర్యం ఫోటోలు వెంటవెంట వెళుతున్నాయి కెమెరాలోకి

ఎన్నోసార్లు సూర్యం అడిగినా తను వొక్కసారైనా వాడి ఫోటో తీయించి ఎరుగడు ఎన్నడో కుటుంబం అంతా కల్సి తీయించుకున్న వొక్క ఫోటోనే. అయితే యివాళ? వాడు అడక్కుండానే పోటీలు పడి ఫోటోలు తీస్తున్నారు—ఎందుకు?

'అదిగో వారే అతని తండ్రి—' నర్సు చెప్పింది.

అంతా మాధవయ్య చుట్టూ చేరేరు

విద్యార్థి నాయకులు సూర్యం ధైర్య సాహసాలను త్యాగాన్ని పొగుడుతున్నారు—మధ్య మధ్య మాధవయ్యను పొగడుతున్నారు—ఏవేవో ఆశలను వ్యక్తం చేస్తున్నారు

పత్రికా విలేఖరుల ప్రశ్నలు ఆయనకు ఉపయోగపడని ప్రశ్నలు ... మనసులోని దుఃఖాన్ని వెలికితెచ్చే ప్రశ్నలు ..పత్రికలు అమ్ముడుపోవటానికి వుపకరించే ప్రశ్నలు...

తప్పనిసరి అయి ఏవేవో సమాధానా లిస్తున్నా, మాధవయ్య ఆలోచన, ఎక్కడో ...ఎక్కడో వుంది!

ఎందుకు? ఇదంతా ,ఎందుకు? ఎవరిని మోసం చేయటానికి?

సూర్యం వాళ్ళంటున్నట్లు హక్కుల కోసం ధైర్యంగా పోరాడేడా? లేక ఎవరో స్వార్థంతో చేస్తున్న, చేయిస్తున్న అరాచకానికి బలి అయ్యాడా?

నిజాని కలాంటివాళ్ళు కడుపులో చల్ల కదలకుండానే వున్నారు ఏమి తెలియని తన కొడుకు—తన కొడుకులాంటి ఎందరో ఎంతో నష్టపోతున్నారు ఈ రహస్యాన్ని దాచిపెట్టి ఎందుకీ మోసం? ఎందుకు?

ఇవాళ యిన్నిమాటలు చెప్పేవారు — యింతగా వాడిని పొగిడేవారు — రేపు వాడి కేమైనా అపుతే ఏం చేయగలరు? వాడికి ప్రాణాన్ని పోయగలరా? తన కొడుకును

(4వ పేజీ చూడండి)



తపతీవ్వగలరా ?

పత్రికల్లో వాడినిగురించి ఎంత వ్రాస్తే కొడుకులేని తన లోటు తీరుతుంది? ఎందరు పెద్దలు సంతాప సందేశాలు పంపినా తనకు కొడుకులేని కొరత తీరుతుందా ? ఎంత డబ్బిచ్చినా, మళ్ళీ తను సూర్యాన్ని కొనుక్కోగలడా ? ... యీ సమ్మెలను, ఆందోళనలు లేవతీసే వారు ఎందుకు తెల్సుకోలేదీ సత్యాన్ని? ఎందుకు?

ఆలోచించలేక ఆగిపోయాడు మాధవయ్య. కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. నోటమాట పెగలటం లేదు.

ఆ స్థితిలోవున్న మాధవయ్య కెమెరాలోకి ఎక్కిపోయాడు.

ఆ పగలంతా ఎవరో వొకరు వస్తూనే వున్నారు. మంత్రులు...ప్రజానాయకులు ... విద్యార్థులు...అధికారులు...

వచ్చినవారు ధైర్యాన్ని చెప్తున్నారు. వూరడిస్తున్నారు.

మాధవయ్య దృష్టిమాత్రం అచేతనంగా పడివున్న కొడుకుమీదనే ఆలోచనా అల్లదే — 'ఎందుకు ? ఎందుకిలా జరిగింది?'

'ఇవాళ ఆందోళన యింకా ఎక్కువయిందిట ?'

'ఎందుకు ? అదేప్రశ్న మళ్ళీ.

తన సూర్యానికి దెబ్బలు తగిలివందుకా? లేక వాడి ఆత్మశాంతికా ?

నిజానికి యీ ఆందోళనకీ, సూర్యానికి దెబ్బ తగలటానికీ సంబంధం వుందా? లేదు ఎవరి ప్రోత్సాహంతోనో, అందరితోపాటు బస్సుఎక్కి వుంటాడు. ఆ కాలేజీకి వెళ్ళివుంటాడు. సమయం వచ్చినప్పుడు ఎలా తప్పించుకోవాలో తెల్సినవాళ్ళంతా తప్పుకొన్నారు. ఏం జరుగుతున్నదో, జరుగబోతున్నదో వూహించలేని పసివాళ్ళు పోలీసుగుండ్లకు ఎరలైనారు

బాధతోకూడిన మూలుగు విని, వులిక్కిపడి కొడుకువైపు చూచాడు,

సూర్యంకళ్ళు నెమ్మది నెమ్మదిగా తెర్చుకొన్నాయి.

'బాబూ...సూర్యం...నాయనా సూర్యం' మాధవయ్య హృదయం ఆనందంతో అరచింది.

'నర్సు...నా బాబు...'

నర్స్ వచ్చింది. ఆ తర్వాత డాక్టర్లు

# ఎందుకు?

(15 వ పేజీ తరువాయి)

వచ్చారు...పరీక్షలు జరుగుతున్నాయి.

ఆ ప్రయత్నంగానే మాధవయ్య కిటికీలోనుంచి ఆకాశంవైపు చూచాడు.

అప్పుడే చీకటి పడుతోంది.

'సరిగ్గా యిరవైనాలు గ్గంటలయింది' అనుకున్నాడు మాధవయ్య.

వీధి దీపాలు వెలిగాయి. మాధవయ్య హృదయంలో ఆశ మెరిసింది.

* * *

కళ్ళు తెర్చాడన్న మాటే కాని మాట లేదు.

తండ్రి వైపు చూస్తాడు సూర్యం— గుర్తించాడో లేదో అన్నది అస్పష్టమే. అయితే ఆ చూపుల్లో పశ్చాత్తాపం, అసహాయత, వేడికోలు ... అన్నీ కన్పిస్తున్నాయి మాధవయ్యకు

చిత్తశుద్ధి కొరవైన దేశంలో సోషలిజంలా రాత్రి నడుస్తోంది.

పెద్ద డాక్టరు చేయాల్సిన పరీక్షలు చేసి, అసిస్టెంట్‌తో చెప్పాల్సిన విషయాలు చెప్పి వెళ్ళిపోయాడు.

నైట్ డ్యూటీకి వచ్చిన నర్సు ఓసారి హాలంతా తిరిగి కుర్చీలో కూర్చొని కునికిపాట్లు కుపక్రమించబోతోంది.

లారీ ఏక్సిడెంట్‌లో దెబ్బలు తగిలి ఆ వోళే వచ్చిన రోగి రాగాలు తీస్తున్నాడు బాధతో.

మాధవయ్య దృష్టంతా కొడుకువైపే అంతవరకు మూసుకొనివున్న కళ్ళను మళ్ళీ తెర్చాడు సూర్యం.

'ఎందుకు ?...ఎందుకు వెళ్ళావురా నాయనా నువ్వక్కడికి ?' కళ్ళతోనే అడిగాడు.

'బుద్ధిలేక వెళ్ళాన్నాన్నా. నన్ను క్షమించు—' సూర్యం కళ్ళల్లో సమాధానం.


రాత్రినుంచి ఏడ్చిఏడ్చి కన్నీళ్ళు ఇంకిపోయాయి. మనసులో ఏదో ఆశ...యింకో వైపు సందేహాలు... ప్రశ్నలు?

ఆందోళన దేనికోసమో తెల్సే పోయాడా సూర్యం? వాళ్ళు అంటున్నట్లు హక్కుల కోసం పోరాడుతూ వీరోచితంగా గాయపడ్డాడా?

అదే విషయాన్ని, మెల్లగా సున్నితంగా అడిగాడు.

'నాకేం తెలియదు నాన్నా. పెద్ద పిల్లలు హుషారుగా వుంటుంది పోదాం రమ్మంటే నిజమేననుకొని వెళ్ళే. నన్నొదిలి పరిగెత్తి పోయేవాళ్ళతోపాటు పరిగెత్తలేక దెబ్బ తిన్నా—' కొడుకు కళ్ళల్లో మాధవయ్య చదివిన భావం.

క్రమంగా సూర్యం కళ్ళు ఉగతతో



మూసుకొన్నాయి మళ్ళీ.

అలాగే కొడుకు వైపు చూస్తూ కూర్చున్న మాధవయ్య కళ్ళుకూడా బడలికతో భారంగా మూతలు పడ్డాయి.

* * *

మళ్ళీ మెలకువవచ్చి, కళ్ళుతెర్చి, కొడుకు పక్కవైపు చూచి గతుక్కుమన్నాడు. పక్క ఖాళీగా వుంది.

'నర్స్ ..'

అరుపు నోట్లో వుండగానే నర్సు అరవ్వొద్దన్నట్లు సౌంజ్ఞ చేసింది.

'నా బాబు .'

నర్స్ వోగదివైపు చూపిస్తూ అంది— 'కంగారు పడకండి. అక్కడ పెద్ద డాక్టరుగారు పరీక్షిస్తున్నాడు—'

'ప్రమాదం లేదుకదా?'

'కంగారు పడకండి—'

మాధవయ్య ఆ గదివద్దకెళ్ళేడు లోపల గోలా హడావుడిగా వున్నట్లుంది. మెత్తటి బూట్ల చప్పుడు లోపలికి వెళ్ళేవారు... బయటికి వచ్చేవారు ..

వాకిట్లో లైట్లు, లంచగొండితనంలా ప్రకాశిస్తున్నాయి. ఆకాశం బ్లాక్‌మార్కెట్టులా, నల్లగావుంది.

'నర్స్'

'కంగారుపడకండి'

'టైం ఎంతయింది?'

'రెండుంబావు—'

మాధవయ్య నిరాశగా నిట్టూర్చాడు! అంతవరకు మాధవయ్య మనసులో వెలిగిన ఆశ సామాన్యుడి బ్రతుకులా, రెపరెప కొట్టుకోసాగింది.

* * *

# ఎందుకు?

మామూలుగానే మళ్ళీ తెల్లవారింది.

'సరిగ్గా ముప్ఫయిఆరుగంటలయ్యింది—' అనుకొన్నాడు మాధవయ్య.

కొడుకు పరిస్థితి యిలాగుందని యిదమిద్ధంగా, ఎంత ప్రయత్నించీ తెల్సుకోలేకపోయాడు. ఆశానిరాశల మధ్య మనసు వూగులాడుతోంది

వేచి వేచి విసుగేసింది. ఆ స్పెషల్‌రూం పెద్ద భూతంలా కన్పించసాగింది. మనశ్శాంతికోసం హాస్పెటల్ వాతావరణాన్ని వదిలేసి వాకిట్లోకి వచ్చాడు.

అలవాటైన జీవితం మళ్ళీ ప్రారంభమయింది జనానికి—

అల్లంతదూరంలో క్యూలో నిలబడి పాలసీసాలకోసం కొట్లాడుకొంటున్నారు జనం. అప్పుడే బస్సుస్టాపులవద్ద జనం చేరుతున్నారు హోటల్లో పెనంమీద పెసరట్ల మోత. కప్పు సాసర్ల గలగలలు విన్పిస్తున్నాయి. కూరగాయలబండి నెట్టుకుంటూ, అరుస్తూ పోతున్నాడొకడు. 'సమ్మె సాగింపు—నాయకుల నిర్ణయం'అని అరుచుకొంటూ సైకిలు మీద పోతున్నాడు పేపర్లమ్మే కుర్రాడు.

కడుపులోని ఆకలిని హోటలు ఆహ్వానించింది.

పంపుదగ్గర మొహం కడుక్కొని, హోటల్లోకి వెళ్ళేడు మాధవయ్య

బల్లమీద ఆరోజు పేపరు, అందులో సూర్యం బొమ్మ ఆ క్రింద తన బొమ్మ అంతా తను వూహించినట్లే జరిగింది!

'మొన్న పోలీసు కాల్పుల్లో దెబ్బలు తగిలిన సూర్యం పరిస్థితి ఆందోళనకరంగా వుంది—'

రేడియోలు వార్తలు చెప్తున్నారు.

మాధవయ్య లేచాడు ఆత్రుతగా.

'మళ్ళీ నిన్నటిలాగే వెళ్తున్నారా సార్?'

కాఫీ తాగి మాధవయ్య హాస్పిటల్ దగ్గరికెళ్ళే సరికి హాస్పిటల్ ముందు జనం.

'యువ వీరుడు సూర్యం.. జిందాబాద్. న్యాయమైన మన కోర్కెల కోసం ప్రాణాన్నొడ్డి పోరాడిన ..'

మాధవయ్య గుండె ఝల్లుమంది. కళ్ళు గిర్రుమని తిరిగేయి.

అందర్నీ తోసుకుంటూ లోపలికెళ్ళిన మాధవయ్యకు సూర్యం శవాన్ని వప్పచెప్పేరు హాస్పిటల్ అధికార్లు.

మొహం మీద గుడ్డ తొలిగించాడు. చావబోయే ముందు ఎప్పుడు, ఎందుకు నవ్వుకొన్నాడో, ఆ నవ్వు అలాగే నిల్చి వుంది సూర్యం మొహంలో!

ఎందుకా నవ్వు? ఎవర్ని చూచా నవ్వు?

వాకిట్లో నినాదాలు చేస్తున్న వారి అమాయకత్వాన్ని చూచి కాదుకదా?

అంతలోనే ఆ నవ్వులో ఏదో భావం... సందేశం!

'నేను చనిపోయానని విచారించకండి నాన్నా. నేను చనిపోతే నీ వొక్కడికే నష్టం కానీ యీ పరిస్థితి యిలాగే సాగితే దేశానికి, ప్రజలందరికీ నష్టం. నా చావు మరింత ఆందోళనకు, అరాచకానికి కారణం కాకుండా, ప్రశాంత పరిస్థితికి దోహదం చేస్తే నా ఆత్మ శాంతిస్తుంది. మనుషుల్లో మంచినీ, మానవత్వాన్ని, నా చావు పెంపొందిస్తే నీకు మాత్రం ఆనందం కాదా నాన్నా?'

'ఆనందమే బాబూ ... ఆనందమే—'

మాధవయ్య హృదయం నిశ్శబ్దంగా అనుకొంది. అంతలోనే ఆ హృదయంలోని తండ్రి వొక్కసారిగా ఘొల్లుమని ఏడ్చాడు.

'కాని నిన్ను నా కిప్పుడెవరైన నా కివ్వగలరా? నువ్వులేని కొరత తీర్చగలరా? మీ అమ్మ శోకాన్ని ఆర్పగలరా?...అసలు నీ మృత్యువుకు బాధ్యులు ఎవరు నాయనా? ఆ విద్యార్థులా, వారి సమస్యలా, సంఘ వ్యతిరేక శక్తులా, పోలీసులా, ప్రజలా, ప్రభుత్వమా, నేనా, లేక నువ్వు... నువ్వేనా? ఎవరు? ఎవరు వీరిలో నీ మరణానికి కారకులు?'

ఏడుస్తూ బిగ్గరగా అడుగుతున్న మాధవయ్య వైపు అర్థం కానట్లు నిర్ఘాంతపోయి చూస్తున్నారు — అప్పుడే అక్కడికి చేరిన ప్రజానాయకులు, విద్యార్థి నాయకులు, హాస్పిటల్ అధికారులు!

'విద్యార్థి వీరుడు సూర్యం—జిందాబాద్'

సూర్యం ఆత్మ శాంతించాలంటే — ఆందోళన కొనసాగించాలి—'

వాకిట్లో నుంచి నినాదాలు బిగ్గరగా విన్పిస్తూనే వున్నాయి! ●

30—5—69


నెలకు రు 10 వంతున చెల్లించి
ట్రాన్‌సిస్టర్ పొందండి!




రల్డ్ వాయిస్' 3 బ్యాండ్ ఆల్‌వరల్డ్, 'ట్రాన్సిస్టర్ అద్భుతమైనది. ప్రపంచఖ్యాతి శక్తివంతము, ...పీ ఆకర్షణగల సరికొత్త జపాన్ మోడల్ ధర రు. 165/- డయల్ లైట్ దీని ప్రత్యేకత ప్రతి గ్రామానికి పట్టణానికి పంపగలం నేడే వ్రాయండి.

ALL WORLD AGENCY (T)
Kalyanpura, Delhi—6